# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం - 07 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 278 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఎవరికీ నష్టం జరగదు

## సీఎం రేవంత్ రెడ్డి

### రేడియల్ రోడ్–2 ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన

### కొత్వాలగూడలో ఎకో పార్క్ ప్రారంభం.. నిర్వాసితులకు సరైన నష్టపరిహారం, ఇళ్ల హామీ

**హైదరాబాద్, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):** మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి ప్రణాళికల్లో నిర్వాసితులు ఎవరికీ నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఎవ్వరినీ అనాధలను చేయబోమని, భూమి లేదా ఇల్లు కోల్పోయిన వారికి సరైన నష్టపరిహారం అందించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. బుద్వేల్ లేఅవుట్‌తో అనుసంధానించే రేడియల్ రోడ్-2 ఇంటర్‌చేంజ్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్వాలగూడలో ఏర్పాటు చేసిన ఎకో పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ మూసీ నది ప్రస్తుతం మురికితో నిండిపోయిందని, కాలానికి అనుగుణంగా నగర అభివృద్ధి ప్రణాళికలు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అందరిని ఒప్పించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ అభివృద్ధిలో స్థానికులను భాగస్వాములుగా చేస్తామని, భూములు కోల్పోయిన వారికి అదే నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అందిస్తామని హామీ ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, బుల్లెట్ ట్రెయిన్ వంటి ప్రాజెక్టుల వల్ల కొందరు భూములు కోల్పోయినా వారికి తగిన నష్టపరిహారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి, ఢిల్లీలో యమునా, ఉత్తరప్రదేశ్‌లో గంగానదుల రివర్ ఫ్రంట్‌లను అభివృద్ధి చేసినట్లే హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు.

మిగతా 2లో..

# హైదరాబాద్‌లో నెక్స్ట్ జెన్ అవరోకిన్ టెక్నాలజీస్ ప్రారంభం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

అధునాతన ఎలక్ట్రానిక్, ఎంబెడెడ్ టెక్నాలజీలపై సంస్థ దృష్టి

టెక్నాలజీ హబ్ గా తెలంగాణ ఎదుగుదలకు నిదర్శనం



2లో

# సివిల్స్ ఫలితాలు విడుదల

## ఆల్ ఇండియా టాపర్‌గా అనుజ్ అగ్నిహోత్రి

మొత్తం 958 మందికి ఎంపిక.. తెలుగు రాష్ట్రాల అభ్యర్థుల ప్రతిభ




2లో



# సీఎంకు కిషన్ రెడ్డి బహిరంగ లేఖ

- భూసేకరణ ఆలస్యంతో పనులు నిలిచిపోయాయని వ్యాఖ్యలు
- ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన
- సర్వీస్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి

2లో

# ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం

- వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం
- 99 రోజుల కార్యక్రమంపై జిల్లా యంత్రాంగంతో చర్చ
- ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచన



2లో




# ప్రజాపాలన అమల్లో ఉమ్మడి మెదక్ ముందుండాలి: మంత్రి వివేక్

- 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థంగా చేరేలా ఆదేశాలు
- తాగునీరు, ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలపై దృష్టి

**మెదక్, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన కార్యక్రమాల అమలులో మెదక్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి జీ. వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మెదక్ సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ సూచనలు చేశారు. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మిగతా 2లో..

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికపై హరీష్ రావు తీవ్ర విమర్శలు

- 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ప్రచార కార్యక్రమమే
- రైతులు, యువత సమస్యలను ప్రస్తావించిన సిద్దిపేట ఎమ్మెల్యే
- ప్రభుత్వ హామీలు అమలు కాలేదని ఆరోపణలు



**హైదరాబాద్, 6 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' పేరుతో అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్రోగ్రామ్‌పై బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమం ప్రజలకు ప్రయోజనం కలిగించేదిగా కాకుండా కేవలం ప్రచార కార్యక్రమంగా మాత్రమే నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు.

మిగతా 2లో..

# నెరడిగొండలో నిపుణుల వైద్య శిబిరం ప్రారంభం

- గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్యమే లక్ష్యం
- ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమం
- రోగులతో మాట్లాడిన మంత్రి జూపల్లి



**నిరడిగొండ, 6 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** నెరడిగొండలో నిర్వహించిన నిపుణుల వైద్య శిబిరాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను వారి ముంగిటకే అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# హైదరాబాద్‌లో నెక్స్ట్ జెన్ అవరోకిన్ టెక్నాలజీస్ ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో నెక్స్ట్ జెన్ అవరోకిన్ టెక్నాలజీస్ ఇండియా ఎల్ఎల్‌పీ సంస్థ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. తెలంగాణలో టెక్నాలజీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ సంస్థ ప్రారంభం ప్రోత్సాహకరమని ఆయన తెలిపారు. ఈ సంస్థ అధునాతన ఎలక్ట్రానిక్ వ్యవస్థలు, ఎంబెడెడ్ టెక్నాలజీలు మరియు ఇంజినీరింగ్ పరిష్కారాలపై పనిచేస్తోంది. ముఖ్యంగా ఏరోస్పేస్, రక్షణ రంగం మరియు పారిశ్రామిక ఆటోమేషన్ వంటి కీలక రంగాలకు సంబంధించిన సాంకేతిక పరిష్కారాలను అందించడంపై సంస్థ దృష్టి పెట్టింది. అనుభవజ్ఞులైన ఇంజినీర్ల బృందం స్థాపించిన ఈ సంస్థ పరిశోధన ఆధారిత ఆవిష్కరణలు, అధునాతన హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్ రూపకల్పన సామర్థ్యాలతో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఈ సంస్థ ప్రారంభం తెలంగాణను ఎలక్ట్రానిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్ మరియు హైటెక్ తయారీ రంగాల్లో కీలక కేంద్రంగా ఎదుగుతున్నదానికి నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.




# సీఎంకు కిషన్ రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్, 6 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఫ్లైఓవర్ ప్రారంభమై దాదాపు సంవత్సరం కావొస్తున్నప్పటికీ సర్వీస్ రోడ్ నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. రూ.265 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్ నిర్మించిందని కిషన్ రెడ్డి తెలిపారు. అయితే భూసేకరణలో ఆలస్యం కారణంగా సర్వీస్ రోడ్ పూర్తి స్థాయిలో నిర్మాణం కాలేదని చెప్పారు. ఈ విషయాన్ని గతంలోనే కేంద్ర రహదారి రవాణా మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. భూసేకరణ కోసం ఇప్పటికే రూ.2.54 కోట్ల పరిహారం చెల్లించినప్పటికీ మధ్యవర్తుల అడ్డంకులు మరియు ఇతర కారణాలతో పనులు ముందుకు సాగడం లేదని ఆయన ఆరోపించారు.

అభివృద్ధి పనుల్లో ఉన్న అడ్డంకులను తొలగించి ప్రజలకు సౌకర్యం కల్పించేలా అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి తన లేఖలో కోరారు.

# సివిల్స్ ఫలితాలు విడుదల

**న్యూఢిల్లీ, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025 తుది ఫలితాలు విడుదలయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా వివిధ కేంద్ర సేవల కోసం మొత్తం 958 మంది అభ్యర్థులను యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఈ ఫలితాల్లో అనుజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలిచారు. రాజేశ్వరి సువే రెండో ర్యాంకు, అకన్ష్ ధుల్ మూడో ర్యాంకు సాధించారు. ఈసారి ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు కూడా తమ ప్రతిభను చాటుకున్నారు. దాదాపు 30 మందికి పైగా తెలుగు అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయాన్ని సాధించడం విశేషం. ఆల్ ఇండియా 23వ ర్యాంకుతో జీను శ్రీ జస్వంత్ చంద్ర, 55వ ర్యాంకుతో పెద్దపల్లి జిల్లాకు చెందిన గుడెల్లి సృజన తెలుగు రాష్ట్రాల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. వీరిద్దరూ ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఇతర తెలుగు అభ్యర్థుల్లో పోలవరపు ధ్వనీష్ 108వ ర్యాంకు, అట్ల తరుణ్ తేజ 123వ ర్యాంకు, శ్రీగిరిరాజు వి.పి.ఎస్. సాయి కృష్ణ 125వ ర్యాంకు, కొలిపాక శ్రీకృష్ణ సాయి 150వ ర్యాంకు, బానోత్ లక్ష్మి రచన 178వ ర్యాంకు సాధించారు. ఎస్. వర్షిత్ రెడ్డి 259వ ర్యాంకు, మాసమ్మగారి పవన్ కుమార్ రెడ్డి 297వ ర్యాంకుతో మెరుగైన ఫలితాలు సాధించారు. అదేవిధంగా వెలిమినేటి విక్రమ్ సింహా రెడ్డి 541వ ర్యాంకు, గుమ్మల శ్వేత 573వ ర్యాంకు, వెలిమినేటి విజయసింహా రెడ్డి 682వ ర్యాంకు, పుదారి రాహుల్ 748వ ర్యాంకు, కత్తిమాని అనిరుధ్ 786వ ర్యాంకు, కొరపోతుల శ్రీకర్ రాజు 806వ ర్యాంకు, ఇస్లావత్ శ్రీరామ్ హర్ష 823వ ర్యాంకు, కట్టా ప్రత్యూష 908వ ర్యాంకు, రాజశేఖర్ గోగుల 920వ ర్యాంకు, గుగోలత్ జితేందర్ నాయక్ 939వ ర్యాంకులతో విజయాన్ని సాధించారు. లక్షలాది మంది పోటీపడే ఈ పరీక్షలో తెలుగు యువత మంచి ప్రతిభ కనబర్చడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పూర్తి ఫలితాల జాబితాను యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం

**వరంగల్, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంపై వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి మంత్రి కొండా సురేఖ జిల్లా యంత్రాంగంతో చర్చించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్న 99 రోజుల కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయాలని, గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మంత్రులు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య భేదం లేకుండా అందరూ భాగస్వాములు కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఎవరికీ నష్టం జరగదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంతంలో నైట్ టూరిజం, వ్యాపార అవకాశాలు కల్పించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.
హైదరాబాద్‌ను ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, శంషాబాద్ ప్రాంతం బుల్లెట్ ట్రెయిన్ హబ్‌గా మారనుందని వెల్లడించారు. బెంగళూరు, అమరావతి, చెన్నై నగరాలకు బుల్లెట్ ట్రెయిన్ సౌకర్యాలు ఇక్కడి నుంచే అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులు ఆకర్షించే విధంగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికపై హరీష్ రావు తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలు గడిచిపోయినా ప్రజలకు గణనీయమైన అభివృద్ధి కనిపించలేదని ఆయన వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్ల పాలనలో చేసిన పనులేమీ లేకపోవడంతో ఇప్పుడు 99 రోజుల ప్రణాళిక పేరుతో మరో కార్యక్రమానికి తెరలేపారని హరీష్ రావు విమర్శించారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి లక్షల సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ అవి ఇంకా పరిష్కారం కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కొత్త కార్యక్రమాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. రైతుల సమస్యల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని హరీష్ రావు ఆరోపించారు. కోతల కాలం వచ్చినప్పటికీ రైతు భరోసా అమలు కాలేదని, గత సీజన్‌కు సంబంధించిన పంట బోనస్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. అంతేకాకుండా యూరియా సరఫరా విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులను నమ్మించి మోసం చేశారని ఆయన ఆరోపించారు.
యువతకు ఉద్యోగాల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోలేదని హరీష్ రావు పేర్కొన్నారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను నిరాశపరిచారని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి చివరకు అది 'జాబ్‌లెస్ క్యాలెండర్'గా మారిందని విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఇతర కార్యక్రమాల పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు.
అదేవిధంగా ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో కూడా పరిస్థితి మెరుగుపడలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఆసుపత్రుల్లో సరైన మందులు లేవని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోతున్నాయని, గ్రామాల్లో పారిశుద్ధ్యం కూడా దెబ్బతిన్నదని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వంటి సాధారణ బాధ్యతలను కూడా పెద్ద కార్యక్రమంలా చూపిస్తూ ప్రచారం చేసుకోవడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన కొద్దిమందిని చూపిస్తూ ప్రచారం చేయడం కంటే, హామీలు అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న లక్షలాది ప్రజల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. సంక్షేమం, అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం ప్రచార కార్యక్రమాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విధానాలపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, గ్రామ గ్రామాన ప్రజలు ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉన్నారని హరీష్ రావు పేర్కొన్నారు.

# సివిల్స్ విజేతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

- తెలంగాణ అభ్యర్థుల విజయంపై హర్షం
- రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం అమలు
- ఇంటర్వ్యూకు వెళ్లిన వారిలో 20 మంది విజేతలు

**హైదరాబాద్, మార్చి 6 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈసారి యూపీఎస్సీ ఫైనల్ ఫలితాల్లో తెలంగాణకు చెందిన అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద కుటుంబాల విద్యార్థులకు అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని అమలు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం ద్వారా సహాయం పొందిన అభ్యర్థుల్లో 51 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరైన వారిలో 20 మంది అభ్యర్థులు తుది ఫలితాల్లో మంచి ర్యాంకులతో విజేతలుగా నిలవడం ఆనందదాయకమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి సివిల్స్‌లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి అభినందనలు తెలిపారు.

# టీచర్ల జీతాలపై ఆకునూరి మురళి నివేదికపై చర్చ

- పౌర సమాజంలో విస్తృత చర్చకు దారితీసిన నివేదిక
- ప్రభుత్వ ఉద్యోగుల జీతాలపై భిన్నాభిప్రాయాలు

**హైదరాబాద్, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):** టీచర్ల జీతాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటూ ఆకునూరి మురళి సమర్పించిన నివేదిక పౌర సమాజంలో విస్తృత చర్చకు దారితీసింది. ఈ నివేదిక వెలుగులోకి వచ్చిన తర్వాత టీచర్లకే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులందరికీ జీతాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయం ప్రజల్లో కొంతమేర పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులకు డి.ఏలు సకాలంలో విడుదల కావడం లేదని, కొత్త వేతన సంఘం అంశంపై కూడా స్పష్టత లేకపోవడం వల్ల ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నివేదిక బయటకు రావడం ప్రభుత్వానికి అనుకూలంగా మారిందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ఇది "కోతికి కొబ్బరికాయ దొరికినట్లే" అయ్యిందని కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. నివేదిక నేపథ్యంలో ఉద్యోగుల వేతనాలపై మరింత చర్చ మొదలైందని పరిశీలకులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, వారి బాధ్యతలు, పని భారం, సమాజానికి అందిస్తున్న సేవల ప్రాముఖ్యత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి మాత్రమే సరైన నిర్ణయాలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ఉద్యోగుల సంక్షేమం మరియు ప్రజల ఆర్థిక పరిస్థితుల మధ్య సమతుల్యత అవసరమని కూడా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# నెరడిగొండలో నిపుణుల వైద్య శిబిరం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

గతంలో నిపుణుల వైద్య సేవలు పొందేందుకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేదని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నిపుణులైన వైద్యులను నేరుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరగేలా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మంత్రి మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో సేవలు అందించాలని ఆయన సూచించారు.

# ప్రజాపాలన అమల్లో ఉమ్మడి మెదక్ ముందుండాలి: మంత్రి వివేక్

(మొదటి పేజీ తరువాయి)

నిపుణులైన వైద్యులను నేరుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరగేలా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మంత్రి మాట్లాడి అందుతున్న



వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో సేవలు అందించాలని ఆయన సూచించారు.



# డంపింగ్ యార్డ్ పొగతో కల్లూరు వాసులకు ఇబ్బందులు

- మూడు రోజులుగా ఆరని మంటలు
- చర్యలు తీసుకోవాలని కల్లూరు మున్సిపాలిటీకి విజ్ఞప్తి

**కల్లూరు, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఖాన్ ఖాన్‌పేట డంపింగ్ యార్డ్‌లో గత మూడు రోజులుగా మంటలు ఆరని పరిస్థితి నెలకొంది. దీంతో వెలువడుతున్న దట్టమైన పొగ ఖాన్ ఖాన్‌పేట, విద్యానగర్ తదితర పరిసర ప్రాంతాల్లో వ్యాపించి స్థానిక ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం చీకటి పడే వరకు డంపింగ్ యార్డ్ నుంచి పొగ తీవ్రంగా వ్యాపిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వయోవృద్ధులు, పాఠశాల-కాలేజీ విద్యార్థులు, క్రీడాకారులు, ఉదయం నడకకు వెళ్లే వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో ఉన్న మంటలను వెంటనే నీటితో ఆర్పించి, పొగ రాకుండా చర్యలు తీసుకోవాలని కల్లూరు మున్సిపాలిటీ అధికారులను స్థానికులు కోరుతున్నారు.



# పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**

99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి పరిశుభ్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ నేటి నుంచి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించే పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కార్యాలయాల్లో ఉన్న పెండింగ్ ఫైల్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రం చేసి మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచితే దోమల పెరుగుదల తగ్గి వ్యాధులను నివారించవచ్చన్నారు.మార్చి నెల ఆర్థిక సంవత్సరానికి చివరి నెల కావడంతో మున్సిపాలిటీల ఆదాయం పెంచేందుకు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీపీఆర్ఓ సీతారాం, డీవైఎస్ఓ సుధీర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**మహబూబ్‌నగర్,మార్చి6 (తెలంగాణ ముచ్చట్లు):**



అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు.శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు .ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్.ఎం. శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఊబేదుల్ల కోత్వాల్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, ఐదు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. అటవీ శాఖకు సంబంధించిన చిన్న సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉండిపోతున్నాయని మంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులను హైదరాబాద్‌కు పంపిస్తున్నారని, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు.రైతులకు యూరియా సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఆన్లైన్ బుకింగ్ విధానంపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి బేస్‌మెంట్ నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సరఫరాలో ప్రాంతాలవారీగా తేడాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా రవాణాలో ఆటోలు, ఇతర వాహనాల్లో అధికంగా ప్రయాణికులను ఎక్కించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణనష్టం పెరుగుతోందని, దీనిపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అభివృద్ధి పనుల అమలుపై అధికారులు మరింత శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీని భారత ప్రధానిగా చేయడమే లక్ష్యం

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**



భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సంఘటితంగా పనిచేసి క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేన రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు బూత్ స్థాయి, వార్డు, గ్రామ, మండల, పట్టణ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.గతంతో పోలిస్తే ఈసారి బూత్ అధ్యక్షుల నియామకాన్ని ప్రత్యేకంగా చేపడతామని, ఓటు హక్కు ఉన్న బూత్‌లోనే అక్కడి నాయకుడు బూత్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తాడని వివరించారు. ఉదాహరణకు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి మంగంపల్లిలో ఓటు హక్కు ఉన్నందున ఆ బూత్‌కు ఆయనే అధ్యక్షుడిగా ఉంటారని తెలిపారు.అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాలతో పాటు విద్యార్థి విభాగాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.మహిళా విభాగాన్ని కూడా ఏర్పాటు చేసి పార్టీ కోసం ఉత్సాహంగా పనిచేసే మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలన్న సంకల్పంతో పార్టీ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని, ఎవరూ నిరాశ చెందకుండా ముందుకు రావాలని సూచించారు.ఈ సమావేశంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికపై అవగాహన ర్యాలీ

**పెద్దమందడి,మార్చి6( తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పెద్దమందడి మండల కేంద్రంలో అధికారులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొదటి రోజు కార్యక్రమంగా సాయంత్రం 3.30 గంటలకు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి గ్రామ ప్రధాన కూడలిలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లక్ష్యాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయ భాస్కర్, మండల అభివృద్ధి అధికారి టి. పరిణత, తహసీల్దార్ పాండు నాయక్, మండల పంచాయతీ అధికారి ఎన్. పుష్ప, గ్రామ సర్పంచ్ సూర్య రవి గంగమ్మ, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చిన్నారులే ఉపాధ్యాయులు.. పెద్దమందడి పాఠశాలలో స్వయం పరిపాలన

**పెద్దమందడి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించడం విశేషం.మొత్తం 27 మంది విద్యార్థులు వివిధ పాత్రల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నందిమల్ల చరణ్ తేజ ప్రధానోపాధ్యాయునిగా, ఎద్దుల అక్షిత ఎంఈఓగా,




జంగం మణికంఠ డీఈవోగా బాధ్యతలు నిర్వహించారు.అలాగే భాస్కర్, దీక్షిత్, అఖిల్, శివ, శివానందు, శివ సాయి చరణ్, లోకేష్, ప్రణీత్, నుమాన్, ఎస్ చరణ్, సమీర్, రోహిత్, వి శివ, రాము, జయప్రియ, రాణి, పర్ణిక, ఆయేషా సిద్ధిఖ, అవని, వైష్ణవి, పావని, అలేఖ్య, పి వర్షిత, శ్రీజ, మారియా ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రోజా రాణి, కిరణ్ కుమార్, ఈశ్వర్, జీకే శ్రీనివాసులు, సుచిత్ర, మధు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు.

# నకిలీ పత్రాలతో భూమి ఆక్రమణ యత్నం ఇద్దరు అరెస్ట్

- చీర్యాల గ్రామంలో ప్లాట్ వివాదం.. త్రిశూల్ ఎంక్లేవ్ పేరుతో నకిలీ లేఅవుట్ బయటపెట్టిన పోలీసులు

**కీసర, మార్చి 06 (తెలంగాణ ముచ్చట్లు):**




కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కీసర ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం, చీర్యాల గ్రామం సర్వే నం.71లోని ప్లాట్ నం.71కు సంబంధించిన భూ వివాదంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.సికింద్రాబాద్ లోతుకుంటకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఇక్బాల్ చంద్ భాటియా (80) 1984 సెప్టెంబర్ 18న చెర్యాల గ్రామంలోని ఈ ప్లాట్‌ను కొనుగోలు చేసి అప్పటి నుంచి శాంతియుతంగా అనుభవిస్తూ వస్తున్నారు.అయితే గత ఏడాది డిసెంబర్ 16న సింగిరెడ్డి సంజీవ రెడ్డి మరియు అతని కుమారుడు సింగిరెడ్డి శశిధర్ రెడ్డి ఆ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి బాధితుడిని దుర్భాషలతో దూషించి బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. తదుపరి రోజు డిసెంబర్ 17న మళ్లీ అక్కడికి వెళ్లి నిర్మాణంలో ఉన్న కంపౌండ్ గోడను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తు సమయంలో నిందితులు "త్రిశూల్ ఎంక్లేవ్" పేరుతో గ్రామపంచాయతీ అనుమతి ఉందని చెబుతూ లేఅవుట్ పత్రాన్ని సమర్పించారు. అయితే పోలీసుల విచారణలో ఆ లేఅవుట్ పూర్తిగా నకిలీగా తయారు చేసిన పత్రం అని తేలింది. భూమిని ఆక్రమించేందుకు ఉద్దేశపూర్వకంగా ఆ నకిలీ పత్రాన్ని తయారు చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మార్చి 5న సంజీవ రెడ్డి, శశిధర్ రెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ప్రజలకు పోలీసుల సూచనలు:భూమి కొనుగోలు చేసే ముందు అసలు సేల్ డీడ్‌ను పరిశీలించాలని, సంబంధిత పత్రాలను న్యాయ నిపుణుల ద్వారా ధృవీకరించుకోవాలని పోలీసులు సూచించారు. సర్వే నంబర్లు, లేఅవుట్ అనుమతులు, రెవెన్యూ రికార్డులు, పంచాయతీ లేదా మున్సిపల్ అనుమతులను సంబంధిత అధికారులతో చెక్ చేసుకోవాలని తెలిపారు. తక్కువ ధరకు భూములు విక్రయిస్తామని చెప్పిన సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని, నకిలీ పత్రాలతో మోసం చేసే ప్రయత్నాలు జరిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమం

- ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యాలయ పరిసరాల శుభ్రపరిచే చర్యలు

**మల్కాజిగిరి, మార్చి 06 (తెలంగాణ ముచ్చట్లు):**





మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి జోనల్ మరియు సర్కిల్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా శుభ్రత చర్యలు చేపట్టారు. కార్యాలయంలో పేరుకుపోయిన పనికిరాని వస్తువులు, విరిగిపోయిన ఫర్నిచర్ మరియు ఇతర వ్యర్థాలను తొలగించి కార్యాలయాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అలాగే కార్యాలయ ప్రాంగణం మరియు వివిధ విభాగాలలో కూడా శుభ్రత కార్యక్రమాన్ని అమలు చేశారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ జాతీయ సుల్తానా, సూపరింటెండెంట్ ఇంజనీర్ లక్ష్మణ్, సూపరింటెండెంట్లు ఆనంద్ కుమార్, నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ

- డా. జిల్లెల చిన్నారెడ్డి

**మహబూబ్‌నగర్,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశగా నిలుస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ 99 రోజులు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల మధ్య ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఐదు దశల్లో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో కార్యక్రమాలు నిర్వహించి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపడతామని తెలిపారు.పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, యువత, క్రీడలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రగతి దిశగా ముందుకెళ్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు .ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## వెల్టూర్‌లో గురుకుల వసతి గృహాన్ని తనిఖీ చేసిన తాసిల్దార్ పాండు నాయక్

**పెద్దమందడి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఉన్న జ్యోతిరావు పూలే బాలికల గురుకుల వసతి గృహాన్ని శుక్రవారం తాసిల్దార్ పాండు నాయక్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఈ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వంట గది, స్టోర్ రూమ్, హ్యాండ్ వాష్ సదుపాయాలు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేసి, వారికి అందుతున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి, పరీక్షల్లో అధిక మార్కులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.గురుకుల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.అలాగే వంట చేసే సిబ్బందికి పరిశుభ్రత పాటిస్తూ వంటలు చేయాలని సూచించారు.విద్యార్థుల హాజరు మరియు ఇతర వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు, పట్టికలను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## సాయిరాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- **వలస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షులు**

**వనపర్తి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి మునిసిపాలిటీలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న ధ్యారపోగు సాయిరామ్ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందడం పట్ల సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మదన్, కవి జనజ్వాల, గంధం నాగరాజు, బందారు శ్రీనివాస్‌లతో కలిసి సాయిరామ్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.అనంతరం పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ సాయిరామ్ ఎప్పుడూ చిరునవ్వుతో అందరిని పలకరించే స్వభావం కలిగిన వ్యక్తి అని, ఆయన ఆకస్మిక మరణం అందరినీ తీవ్ర షాక్‌కు గురి చేసిందని తెలిపారు.కుటుంబానికి అండగా ఉండాల్సిన కుటుంబ యజమాని మృతి చెందడంతో సాయిరామ్ కుటుంబం అనేక సమస్యల్లో పడిందన్నారు. అందువల్ల ప్రభుత్వం సాయిరామ్ కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబంలోని ఒకరికి మునిసిపాలిటీలో ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే మునిసిపాలిటీ అధికారులు కూడా చొరవ చూపించి సాయిరామ్ కుటుంబానికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.



## పామిరెడ్డిపల్లిలో ఘనంగా వీర నాగమ్మ–బీరప్ప పండుగ

**పెద్దమందడి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో కురువ కులస్తులు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వీర నాగమ్మ-బీరప్ప పండుగ ఘనంగా కొనసాగుతోంది.గ్రామంలోని భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ భక్తి శ్రద్ధలతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.పండుగలో భాగంగా శుక్రవారం వీర నాగమ్మ అమ్మవారికి పుట్ట బంగారం తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. డప్పులు, తాళాలు మోగిస్తూ అమ్మవారిని ఘనంగా పూజించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు కలిసి పండుగ ఏర్పాట్లలో చురుకుగా పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, భక్తులు కలిసి పండుగను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పండుగ ఉత్సవ కమిటీ సభ్యులు మధ్య శ్రీశైలం, పెద్ద మల్లయ్య, చంద్రయ్య, శేషయ్య, మల్లయ్య, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి కాలనీలో ‘బస్తీ బాట’ కార్యక్రమం

- **మల్లాపూర్ ఉమ్మడి డివిజన్‌లో పర్యటించిన కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**
- **ప్రజల సమస్యలపై స్పందన**

**మల్లాపూర్, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ‘బస్తీ బాట’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కాలనీల్లో ఉన్న మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్లాపూర్ ఉమ్మడి డివిజన్, శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని మీనా నగర్, బ్రహ్మపురి కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, చండియా నగర్ తదితర ప్రాంతాల్లో పరమేశ్వర్ రెడ్డి పర్యటించారు. కాలనీల్లో తిరుగుతూ స్థానిక ప్రజలను నేరుగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీవాసులు తాగునీరు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక సదుపాయాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటితో పాటు రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని పరమేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.బస్తీల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ‘బస్తీ బాట’ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారాం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్. వి. కిట్టు, నెమలి అనిల్, బెల్లం గట్టియ్య, దంతురి రాజు, కోయగూర బాలరాజ్, మక్తల బాలరాజ్, సురేష్, బెల్లం శ్రీను, జెమిలా బేగం, మధుసూదన్ రెడ్డి, సద్గుణ, జానీ భాయ్, పార్వతాలు, శ్రీనివాస్, రాజేష్, శ్రీకాంత్ రెడ్డి, ఫిరోజ్, శైలజ, విజయ్ చారి, ఉపేందర్, సాయి టిల్లు, సాయి జయంత్ తదితరులు పాల్గొన్నారు.





## అంగన్వాడి సేవలపై అవగాహన... మనిగిళ్ళలో కమిటీ సమావేశం

**పెద్దమందడి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిళ్ళ గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడి స్థాయి పర్యవేక్షణ కమిటీ మరియు ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాసుల గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాల పరిధిలో అందించే ముఖ్యమైన సేవలపై విస్తృతంగా చర్చించారు.అనుబంధ పోషకాహారం పంపిణీ, 3-6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, 0-5 సంవత్సరాల పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, లోపపోషణతో బాధపడుతున్న తీవ్రమైన మరియు మోస్తరు లోపపోషణ గల పిల్లల ఆరోగ్య పరిస్థితులపై వివరించారు. అలాగే అంగన్వాడిలో అమలు చేస్తున్న ముఖ గుర్తింపు ఆధారిత చిత్ర నమోదు విధానం, గర్భిణీ మరియు బాలింతల పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ఆరోగ్యలక్ష్మి పథకం కింద గర్భిణీ, బాలింతలు రోజుకు ఒకపూట సంపూర్ణ భోజనం తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందాల్సిన సేవలను పారదర్శకంగా అందించేందుకు అంగన్వాడి టీచర్లు కృషి చేయాలని సర్పంచ్ శ్రీనివాసుల గౌడ్ సూచించారు. గర్భిణీ, బాలింతలు ఆరోగ్యం, పరిశుభ్రతపై తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.అలాగే గ్రామ అభివృద్ధిలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి తల్లిదండ్రులు బాధ్యత వహించాలని, తమ పిల్లలను చదువుపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలని సూచించారు.ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు నాగరాణి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతంగా అమలు చేస్తూ పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి టీచర్లు తగిన సమయ పట్టికను పాటించాలని తెలిపారు. తద్వారా పిల్లలు ప్రాథమిక విద్య పూర్తిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.తక్కువ బరువు, లోపపోషణ గల పిల్లల సంరక్షణ కోసం బాలామృతం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి గృహానికి తీసుకెళ్లే పోషకాహారాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాసుల గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు నాగరాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు అరుణ, ప్రమీల, రాధా, ఆశా కార్యకర్తలు, గర్భిణీ బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో మండల స్థాయి బాల్ మేళా–2.0 విజయవంతం

- **ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు.**
- **జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక.**

**దమ్మపేట, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):**

దమ్మపేట మండలంలో మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్ బాల్ మేళా-2.0 కార్యక్రమాన్ని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన బాల్ మేళాలో పాల్గొన్న విద్యార్థులలో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి, ప్రథమ మరియు ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో మండల స్థాయి పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ





స్థానంలో నిలిచిన విద్యార్థులను ఈ నెల 9న జరగనున్న జిల్లా స్థాయి బాల్ మేళా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపిక చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని పెంపొందించడంలో ఇటువంటి బాల్ మేళా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పరీక్షలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి జగపతి మాట్లాడుతూ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన బాల్ మేళా కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి మండల స్థాయిలో పోటీలు నిర్వహించామని చెప్పారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలకు కూడా మన మండలం విద్యార్థులు ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మారెమ్మ, ఉపేందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉషారాణి, రిసోర్స్ పర్సన్లు రమేష్ బాబు, రాంబాబు, రామకృష్ణ, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

- **సెయింట్ పాల్ స్కూల్‌లో ఎగ్జామ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్స్‌లు అందజేత**

**నాచారం, మార్చి 06 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పెట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలో ఉన్న సెయింట్ పాల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు.డివిజన్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్ కరిపే సహకారంతో ఏర్పాటు చేసిన ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు జామెట్రీ బాక్స్‌లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఏకాగ్రతతో సిద్ధమై మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని, తమ భవిష్యత్తును నిర్మించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉల్లెం బాలరాజు, మల్లేష్ గౌడ్, దేవేందర్ కుమార్, వసంతరావు, వాసు చారి, నవీన్ గౌడ్, మధు ముదిరాజ్, రామకృష్ణ, కిరణ్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.








# విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలకు ప్రోత్సాహం

**తార్నాక, మార్చి 06 (తెలంగాణ ముచ్చట్లు):** నారాయణ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తమ సృజనాత్మకతను, పరిశోధనా నైపుణ్యాలను వివిధ శాస్త్రీయ నమూనాల రూపంలో చక్కగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథులుగా డీఆర్డీఓ సైంటిస్ట్ ఉప్పల ఉదయ్ కుమార్, పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు సంవత్సరం పొడవునా నేర్చుకున్న పాఠాలను వివిధ నమూనాల రూపంలో అందరికీ కళ్లకు కట్టినట్లు చూపించారని అభినందించారు. సాధారణ శాస్త్రానికి సంబంధించిన పనిచేసే నమూనాలను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్, హైస్కూల్ ఆర్ & డి హెడ్ మనోహర్, హైస్కూల్ కోఆర్డినేటర్ ఆజాద్, ఈచాంప్స్ కోఆర్డినేటర్ లక్ష్మీభవాని, ఈకిడ్జ్ కోఆర్డినేటర్ నూర్, హైస్కూల్ ఏడి సురేష్, ఈచాంప్స్ వి.పి. సరిత, ఈకిడ్జ్ వి.పి. షాహీన్, పీఈటీ నరేష్, ఏఓ మహేందర్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# విజయ హై స్కూల్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

- విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించిన కుషాయిగూడ పోలీసులు

**కాప్రా, మార్చి 06 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కాప్రాలోని విజయ హై స్కూల్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు మరియు సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలతో పాటు భవిష్యత్తు కూడా దెబ్బతింటుందని వారు తెలిపారు. యువత మాదకద్రవ్యాల మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం చేస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని పోలీసులు సూచించారు.



# ఖమ్మం డిపోను ఆకస్మికంగా తనిఖీ చేసిన టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలోమన్

**ఖమ్మం బ్యూరో, మార్చి 6(తెలంగాణ ముచ్చట్లు)** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కరీంనగర్ జోన్ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ సోలోమన్ శుక్రవారం ఖమ్మం డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని వివిధ విభాగాలను సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. డిపో అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు. ఖమ్మం డిపోలోని ఉద్యోగులు అందరూ కష్టపడి పని చేసి డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తే సంస్థ మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఖమ్మం కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌లను పరిశీలించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బస్సుల రాకపోకలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఇక ఖమ్మం డిపో గ్యారేజీలో మెకానిక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'టీమ్-20' సభ్యులతో సమావేశమై డిపో లాభనష్టాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ సరి రామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ శివ ప్రసాద్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ త్రికూటేశ్వర ఆలయంలో మహా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

- 108 జంటలతో మహా హోమం

**భీమదేవరపల్లి, మార్చి 6. (తెలంగాణ ముచ్చట్లు):** ముత్తారం త్రికుటేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామంలో శ్రీ త్రికూటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధనం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గోపూజ చేసి యాగశాల ప్రవేశద్వారం వద్ద కుంభపూజను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహా అఖండ దీపాన్ని వెలిగించి, నవగ్రహ పూజలను నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక హోమాలు, శాంతి పూజలు నిర్వహిస్తూ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా కొనసాగించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయని, ముఖ్యమైన పూజా కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు మరియు మహిళలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు హరీష్ చారి బృందం పాల్గొన్నారు.








# మణిగిల్ల వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు.. జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు

**పెద్దమందడి,మార్చి6(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని మణిగిల్ల గ్రామ వాగులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.వివరాల్లోకి వెళ్తే... పెద్దమందడి మండల తహసిల్దార్ ఆదేశాల మేరకు మణిగిల్ల గ్రామ వాగులో జేసీబీ యంత్రంతో అక్రమంగా ఇసుక తవ్వి నిల్వ చేసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో మణిగిల్ల గ్రామ జీపీఓ ఎలుగు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.రాజపేటకు చెందిన జేసీబీ డ్రైవర్ కేశమోని మల్లేష్ ప్రభుత్వ అనుమతులు లేకుండా వాగులో ఇసుక తవ్వకాలు నిర్వహించినట్లు ఆరోపణలు రావడంతో, పెద్దమందడి ఎస్సై పి. జలంధర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



# వల్లభాపూర్ పశువైద్యశాల ఆవరణలో మద్యం సేవనం

- చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్

**ఎల్కతుర్తి, మార్చి 6 (తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి సమీపంలోని వల్లభాపూర్ గ్రామంలోని గ్రామీణ పశువైద్యశాల ఆవరణలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ బీర్ సీసాలు, మద్యం బాటిళ్లను అక్కడే పడేస్తుండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.






రాత్రి వేళల్లో మాత్రమే కాకుండా మధ్యాహ్న సమయంలో కూడా అక్కడికి వచ్చి మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను పశువైద్యశాల ముందు, చుట్టుపక్కల ప్రాంతాల్లో పడేస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. కొన్నిసార్లు బీర్ సీసాలను పగలగొట్టి రోడ్డుపై వేయడంతో అక్కడికి వెళ్లే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ముఖ్యంగా వాటర్ ప్లాంట్ పక్కన గాజు ముక్కలు చెల్లాచెదురుగా పడిపోవడం సమస్యగా మారింది.

పశువైద్యశాల పక్కనే ఉన్న శివాలయానికి వెళ్లే దారిలో కూడా గాజు సీసాల ముక్కలు పడిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆ మార్గంలో నడిచే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి స్పందించి అక్కడ మద్యం సేవిస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అవసరమైతే పోలీస్ స్టేషన్ సహకారంతో అక్కడ పర్యవేక్షణ పెంచి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామంలోని ప్రజా ప్రదేశాలను అపవిత్రం చేయకుండా, దేవాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ నామ పరామర్శ

- రాములమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎంపీ నామ, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల

**ఖమ్మం బ్యూరో, మార్చి 6(తెలంగాణ ముచ్చట్లు )** మధిర మున్సిపాలిటీ 19వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు మాతృమూర్తి యన్నంశెట్టి రాములమ్మ గురువారం సాయంత్రం కన్నుమూసిన విషయం విదితమే. ఈ సందర్భంగా శుక్రవారం మధిర పట్టణంలోని వారి నివాసం నుంచి స్మశానవాటిక వరకు జరిగిన అంతిమయాత్రలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి లింగాల కమల్ రాజు తో పాటు కలసి ఆయన పాల్గొన్నారు అనంతరం అక్కడ ఆమె పార్థివదేహానికి మాజీ ఎంపీ నామ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యన్నంశెట్టి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి మాతృమూర్తి మృతి పట్ల నామ తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేశారు.



# జర్నలిస్టుల అక్రిడేషన్ సమస్యలు పరిష్కరించండి

- టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం
- జర్నలిస్టులకు జరుగుతున్న నష్టాన్ని వివరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామ్ నారాయణ
- సమాచార శాఖ కమిషనర్ తో చర్చించి పరిష్కరిస్తానని హామీ

**ఖమ్మం బ్యూరో, మార్చి 6(తెలంగాణ ముచ్చట్లు)** జర్నలిస్టుల అక్రిడేషన్ మంజూరు విషయంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, అక్రిడేషన్ల జీవో లో ఉన్న ఇబ్బందులు సవరించాలని టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) జర్నలిస్టు యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి యూనియన్ నేతలు వినతి పత్రం అందజేసి సమస్యలు వివరించారు.



శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే .రామనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకటరావు, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి పి.మహేందర్, జిల్లా జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు తదితరులు మంత్రిని కలిసి సమస్యలను దృష్టికి తెచ్చారు. ప్రధానమైన 8 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమాచార శాఖ కమిషనర్ తో చర్చించి జర్నలిస్టులకు ఇబ్బందులు లేకుండా అక్రిడేషన్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఉపాధ్యక్షులు మొయినుద్దీన్, జిల్లా నాయకులు ఏలూరి వేణుగోపాలరావు, పసుపులేటి సత్యనారాయణ, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ నామ, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల

**ఖమ్మం బ్యూరో, మార్చి 6(తెలంగాణ ముచ్చట్లు):** మధిర అసెంబ్లీ నియోజకవర్గం, ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ యరమల రేణుక -కృష్ణారెడ్డి దంపతుల కుమారుడు సాంబశివరెడ్డి వివాహం మధిర వాస్తవ్యులు శీలం కాశీ విశ్వేశ్వర రెడ్డి -పద్మ దంపతుల కుమార్తె శ్రావణితో మధిర వైరా రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నాడు ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్, మధిర అసెంబ్లీ ఇంచార్జి లింగాల కమల్ రాజు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.




## వేలేరు అభివృద్ధి కి శ్రీకారం రూ.30 లక్షల సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

**వేలేరు, మార్చ్ 06 (తెలంగాణ ముచ్చట్లు ):**

వేలేరు మండల కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను వేలేరు సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి ప్రారంభించారు. ఈ పనులు మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మరియు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గార్ల సహకారంతో చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ త్వరలోనే ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యల సహకారంతో నిధులు తీసుకువచ్చి వేలేరు గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని అన్నారు. తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామానికి వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.22 లక్షలు, వీఓ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, జీపీ కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు సురేష్, సంధ్య, ప్రశాంత్, ప్రవళిక, చైతన్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీ పెద్దలు వేణుగోపాల్ రెడ్డి, వీరారెడ్డి, రాజు, రవీందర్ రెడ్డి, సాంబరాజు, నారాయణ తదితరులు హాజరయ్యారు.



## మల్లికుదుర్లలో పాఠశాలలపై ఆకస్మిక తనిఖీలు

**వేలేరు, మార్చ్ 06(తెలంగాణ ముచ్చట్లు ):**

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్ వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో అంగన్వాడి కేంద్రం, ప్రైమరీ స్కూల్ మరియు జిల్లా పరిషత్ పాఠశాలలను గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలోని రిజిస్టర్ పుస్తకాలను పరిశీలించి, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు పరిస్థితిని తెలుసుకునేందుకు సర్పంచ్ మౌనిక సంపత్ యాదవ్ స్వయంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యత, వంట విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



పాఠశాలల్లో విద్యార్థులకు మంచి వాతావరణంలో విద్య అందేలా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలు సర్పంచ్ చేపట్టిన ఈ చర్యను అభినందించారు.

# ప్రజాపాలన - ప్రగతికి సరికొత్త బాట

- 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి
- రెవెన్యూ - అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం బ్యూరో, మార్చి 6(తెలంగాణ ముచ్చట్లు)**

ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు.

**సాంకేతిక లోపాలు సరిదిద్ది.. బాధ్యతను నిర్ధారించాలి**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు.





అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

**అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు**

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ మరియు రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు మరియు రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ.. నిధుల వినియోగం**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు మరియు చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు.

**సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యం**

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగు మందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకూ భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

**పార్టీలకు అతీతంగా ప్రజా సేవ**


ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు ఏడ రాజమ్మకు నివాళులర్పించిన సింగపురం ఇమ్మనియెల్ రాజ్

**వేలేరు, మార్చ్ 06 (తెలంగాణ ముచ్చట్లు):**


వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన ఏడ రాజమ్మ ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి సింగపురం ఇందిరా కుమారుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ వారి గ్రామానికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పెద్ద నగేష్, కాంటెస్ట్ సర్పంచ్ జల్తారు రేణుక శ్రీనివాస్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు మంతపురి రాజు, కూరపాటి శంకర్, గద్దె మనోహర్, పెండ్లి వెంకటేష్, గణేష్, దేవిడ్ బాబు, ప్రతిష్ తదితరులు పాల్గొన్నారు.



# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు దేశీయ షేర్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో పెట్టుబడిదారులు ఆందోళనకు గురయ్యారు. దీనివల్ల దేశీయ మార్కెట్లలో భారీ అమ్మకాలు చోటు చేసుకుని సూచీలు తీవ్రంగా పడిపోయాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ ఒక్కరోజులోనే 1097 పాయింట్లు కోల్పోయింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 78,918 వద్ద, నిఫ్టీ 24,450 వద్ద స్థిరపడ్డాయి.




ఇరాన్ బహ్రెయిన్‌లోని చమురు శుద్ధి కేంద్రంపై దాడులు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 86 డాలర్లకు చేరడంతో భారత రూపాయి విలువపై ఒత్తిడి పెరిగింది. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 91.84 స్థాయికి పడిపోయింది. మార్కెట్లో అనిశ్చితిని సూచించే సూచీ కూడా సుమారు 11 శాతం పెరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

ఈ పతనంలో ముఖ్యంగా బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ రంగాలకు చెందిన షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 2 శాతం కంటే ఎక్కువ పడిపోయి 57,783 వద్దకు చేరింది. పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించడం వల్ల అనేక రంగాల్లో అమ్మకాలు పెరిగినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే యుద్ధ వాతావరణం కారణంగా రక్షణ రంగానికి చెందిన సంస్థల షేర్లకు మాత్రం డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ రంగ రక్షణ సంస్థల షేర్లు దాదాపు 9 శాతం వరకు లాభపడినట్లు మార్కెట్ సమాచారం చెబుతోంది. దీంతో భారీ నష్టాల మధ్య కూడా పెట్టుబడిదారులకు కొంత మేర ఊరటనిచ్చినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# యాప్ తెరవకుండానే చాట్ చేసే సీక్రెట్ ట్రిక్

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగిస్తున్న ప్రముఖ సందేశాల పంపిణీ యాప్ వాట్సాప్ తన వినియోగదారులకు మరింత సౌకర్యం కల్పించే విధంగా అనేక కొత్త ఫీచర్లను అందిస్తోంది. అయితే చాలామందికి తెలియని ఒక ఆసక్తికరమైన ట్రిక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాధారణంగా ఎవరికైనా సందేశం పంపాలంటే ముందుగా వాట్సాప్ యాప్‌ను తెరిచి, ఆ వ్యక్తి పేరును వెతికి చాట్ ప్రారంభించాలి. కానీ ఈ సులభమైన ట్రిక్ ద్వారా యాప్‌ను తెరవకుండానే నేరుగా చాట్ ప్రారంభించే అవకాశం ఉంటుంది.

భారతదేశంలో కోట్ల సంఖ్యలో వినియోగదారులు ఉన్న వాట్సాప్‌లో ఇటీవల పరిచయం చేసిన ఒక ప్రత్యేక సౌకర్యం ద్వారా ఈ విధానం సాధ్యమవుతోంది. ముఖ్యంగా తరచుగా మాట్లాడే వ్యక్తుల కోసం ఈ ఫీచర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఒక వ్యక్తి చాట్‌ను నేరుగా మొబైల్ హోమ్ స్క్రీన్‌పై షార్ట్‌కట్‌గా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ షార్ట్‌కట్‌పై ఒక్కసారి నొక్కితే వెంటనే ఆ వ్యక్తి చాట్ విండో తెరుచుకుంటుంది.




ఈ సౌకర్యం ప్రస్తుతం ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్లు ఉపయోగించే వారికి అందుబాటులో ఉంది. ముందుగా వాట్సాప్ యాప్‌ను తెరిచి, హోమ్ స్క్రీన్‌పై ఉంచాలనుకున్న వ్యక్తి చాట్‌ను కొద్ది సేపు నొక్కి ఉంచాలి. తరువాత పైభాగంలో కనిపించే మెనూ ఎంపికలను తెరిచి, చాట్ షార్ట్‌కట్‌ను జోడించే ఎంపికను ఎంచుకోవాలి. అనంతరం ధృవీకరణ బటన్ నొక్కితే ఆ వ్యక్తి ఫోటోతో కూడిన ఐకాన్ మొబైల్ హోమ్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

ఈ షార్ట్‌కట్‌ను ఉపయోగించడం ద్వారా ప్రతిసారి యాప్‌ను తెరవాల్సిన అవసరం ఉండదు. నేరుగా హోమ్ స్క్రీన్ నుంచే ఆ వ్యక్తితో చాట్ ప్రారంభించవచ్చు. ముఖ్యంగా అత్యవసర సందర్భాల్లో లేదా తరచుగా మాట్లాడే వ్యక్తులతో వేగంగా సంప్రదించాల్సినప్పుడు ఈ ఫీచర్ ఎంతో ఉపయోగపడుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ట్రిక్ గురించి తెలుసుకున్న అనేక మంది వినియోగదారులు తమ మొబైళ్లలో ఈ సౌకర్యాన్ని ఉపయోగించడం ప్రారంభించారు.




# పోషకాహారానికి ధాన్యాల ప్రాధాన్యం

ప్రతి సంవత్సరం మార్చి 7ను ప్రపంచ ధాన్యాల దినోత్సవంగా గుర్తించి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. మానవ జీవనంలో ధాన్యాల ప్రాముఖ్యతను గుర్తుచేసే రోజు ఇది. ప్రపంచ జనాభాలో ఎక్కువమంది ప్రజల ఆహారంలో బియ్యం, గోధుమ, జొన్నలు, సామలు, రాగులు వంటి ధాన్యాలు ముఖ్య భాగంగా ఉంటాయి. ఈ ధాన్యాలు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా అనేక పోషకాలను కూడా అందిస్తాయి. అందువల్ల ఆరోగ్యకరమైన జీవనానికి ధాన్యాలు అత్యంత కీలకమైనవిగా భావిస్తారు. ధాన్యాలు మనిషి ఆహార వ్యవస్థలో ప్రాధాన్య స్థానాన్ని కలిగి ఉన్నాయి. పురాతన కాలం నుంచే వ్యవసాయ సంస్కృతిలో ధాన్యాలకు ప్రత్యేక స్థానం ఉంది. బియ్యం, గోధుమలు ప్రపంచంలో అత్యధికంగా వినియోగించే ధాన్యాలు కాగా, భారతదేశంలో జొన్నలు, సామలు, రాగులు వంటి సాంప్రదాయ ధాన్యాలు కూడా విస్తృతంగా వినియోగించబడుతున్నాయి. ఇవి శరీరానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఖనిజాలు మరియు తంతువులను సమృద్ధిగా అందిస్తాయి.

పోషకాహార లోపం ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రధాన సమస్యగా మారుతున్న నేపథ్యంలో ధాన్యాల ప్రాముఖ్యత మరింత పెరిగింది. సమతుల్య ఆహారంలో ధాన్యాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు వృద్ధులకు అవసరమైన శక్తి మరియు పోషకాలను అందించడంలో ఇవి సహాయపడతాయి. సాంప్రదాయ ధాన్యాలలో తంతువు అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది మరియు శరీరానికి కావలసిన శక్తి నిల్వగా ఉంటుంది. ఇటీవల కాలంలో జీవనశైలిలో మార్పులు, ఫాస్ట్ ఆహారాల వినియోగం పెరగడం వల్ల సంప్రదాయ ధాన్యాల వినియోగం కొంత తగ్గింది. అయితే వైద్య నిపుణులు మరియు పోషకాహార నిపుణులు మళ్లీ ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా సామలు, జొన్నలు, రాగులు వంటి సిరిధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి మధుమేహం, అధిక బరువు, గుండె సంబంధిత సమస్యలను నియంత్రించడంలో సహాయపడతాయి.

ప్రపంచ ధాన్యాల దినోత్సవం సందర్భంగా పోషకాహారం మరియు ఆహార భద్రత గురించి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యవసాయ రంగంలో ధాన్యాల ప్రాధాన్యాన్ని తెలియజేసే సమావేశాలు, సదస్సులు మరియు ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. రైతులు ఎక్కువగా ధాన్యాల సాగు చేయాలని ప్రోత్సహించడమే కాకుండా ప్రజలు తమ రోజువారీ ఆహారంలో ధాన్యాలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ధాన్యాలు కేవలం ఆహారంగా మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. భారతదేశం వంటి వ్యవసాయ ప్రధాన దేశాల్లో ధాన్యాల ఉత్పత్తి రైతుల జీవనాధారంగా ఉంటుంది. వ్యవసాయ రంగ అభివృద్ధికి ధాన్యాల సాగు ముఖ్యమైన అంశంగా నిలుస్తోంది. సరైన విధంగా ధాన్యాల ఉత్పత్తి మరియు వినియోగం పెరిగితే దేశంలో ఆహార భద్రత మరింత బలపడుతుంది. సాంప్రదాయ ధాన్యాల వినియోగాన్ని పెంచడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు. పోషకాహారాన్ని అందరికీ అందుబాటులో ఉంచడంలో ధాన్యాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో ధాన్యాలను చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రపంచ ధాన్యాల దినోత్సవం ఈ విషయాన్ని గుర్తుచేసే ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది.



# ధర్మ గార్డియన్–2025లో డ్రోన్, కౌంటర్ డ్రోన్ శిక్షణ

- **భారత సైన్యంతో జపాన్ భూ సైన్యం సంయుక్త విన్యాసాలు**
- **ఉగ్రవాద వ్యతిరేక పరిస్థితుల్లో శిక్షణ**
- **ఆధునిక యుద్ధ వ్యూహాలపై నైపుణ్యాల పెంపు**

భారత సైన్యం మరియు జపాన్ భూ స్వీయ రక్షణ దళం సంయుక్తంగా నిర్వహిస్తున్న "ధర్మ గార్డియన్-2025" సైనిక విన్యాసాల్లో డ్రోన్ మరియు కౌంటర్ డ్రోన్ శిక్షణ కొనసాగుతోంది. ఉగ్రవాద వ్యతిరేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విన్యాసాల్లో భాగంగా డ్రోన్‌ల ద్వారా రియల్ టైమ్ వీడియో ప్రసారం చేసి యుద్ధభూమిలో ఉన్న సైనిక దళాలకు సహకరించే విధానాలను సైనికులు అభ్యసిస్తున్నారు. అలాగే శత్రు డ్రోన్‌లను గుర్తించి నిర్వీర్యం చేసే విధానాలపై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జపాన్ భూ స్వీయ రక్షణ దళం మరియు భారత సైన్యం మధ్య పరస్పర అనుభవాలను పంచుకుంటూ ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా సైనిక సామర్థ్యాలను పెంపొందించడమే ఈ విన్యాసాల లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ సంయుక్త విన్యాసాలు రెండు దేశాల సైన్యాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక రణతంత్ర నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.






# ముందుగానే మండుతున్న ఎండలు

**మార్చి ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు పెరుగుదల**
**ఆరు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు**
**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు**

తెలంగాణలో వేసవి తన ప్రభావాన్ని ముందుగానే చూపిస్తోంది. మార్చి నెల ప్రారంభంలోనే సూర్యుడు భగభగ మండుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. సాధారణంగా మార్చి మూడో వారం తర్వాత పెరిగే ఎండల తీవ్రత ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే ప్రారంభమైంది. తాజాగా ములుగు జిల్లా మంగపేటలో గరిష్ఠంగా 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ అర్బన్, ధర్మపురి, ఖమ్మం అర్బన్ ప్రాంతాల్లో కూడా 38.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత రెండు రోజులుగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే సుమారు 2.2 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని అంచనా వేస్తూ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన 27 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు ప్రకటించారు. ఈ వారంలో రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి నుంచి ఒకటిన్నర డిగ్రీల వరకు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు. ఉత్తర భారతదేశం నుంచి తెలంగాణ వైపు పొడి, వేడి గాలులు వీస్తుండటమే ఈ తీవ్రతకు ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటంతో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని హెచ్చరిస్తున్నారు. శరీరం డీహైడ్రేట్ కాకుండా తగినంత నీరు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున చల్లని ప్రదేశాల్లో ఉండాలని నిపుణులు పేర్కొన్నారు.

# రైతుల సంక్షేమమే ఆహార భద్రతకు పునాది

- **గ్రామీణ వ్యవసాయం – దేశ భవిష్యత్తు**
- **పంటల మార్పులతో వ్యవసాయానికి కొత్త దిశ**
- **ధాన్యాల ఉత్పత్తి పెంపుతో దేశాభివృద్ధి**



భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా కొనసాగుతోంది. కోట్లాది మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల గ్రామీణ వ్యవసాయం బలోపేతం కావడం దేశ భవిష్యత్తుకు అత్యంత అవసరం. రైతుల సంక్షేమం, పంటల ఉత్పత్తి, ఆహార భద్రత వంటి అంశాలు దేశ అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయి. వ్యవసాయం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. ప్రస్తుతం రైతులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, పెరుగుతున్న సాగు ఖర్చులు వంటి సమస్యలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంటలకు సరైన ధరలు లభించకపోవడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులకు సరైన మద్దతు అందించడం ప్రభుత్వాల ముఖ్య బాధ్యతగా మారింది. రైతులకు ఆర్థిక సహాయం, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలి.

వ్యవసాయ రంగంలో పంటల మార్పు కూడా ఎంతో అవసరం. ఒకే పంటపై ఆధారపడకుండా విభిన్న పంటలను సాగు చేయడం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ధాన్యాలతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, తోటపంటలు వంటి పంటలను కూడా సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగవచ్చు. సాంప్రదాయ ధాన్యాలు అయిన జొన్నలు, రాగులు, సామలు వంటి సిరిధాన్యాల సాగు కూడా రైతులకు మంచి అవకాశాలను అందిస్తోంది. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ఈ ధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ కూడా పెరుగుతోంది. దేశంలో ఆహార భద్రతను కాపాడటంలో దానాల ఉతతి కీలక పాత్ర పోషిస్తుంది. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందువల్ల ధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం మరియు రైతులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన విత్తనాలు, సాగు సాంకేతికతలను వినియోగించడం ద్వారా పంటల దిగుబడిని పెంచవచ్చు. ఈ విధంగా వ్యవసాయ రంగంలో ఆధునికతను తీసుకురావడం ద్వారా రైతులకు మంచి లాభాలు సాధ్యమవుతాయి.


గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వ్యవసాయం ఒక ప్రధాన ఆధారంగా నిలుస్తుంది. రైతుల ఆదాయం పెరిగితే గ్రామాల్లో ఆర్థిక చలనం పెరుగుతుంది. రైతులు బలపడితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. వ్యవసాయానికి అనుబంధ రంగాలు అయిన పశుపోషణ, కోళ్లు పెంపకం, తేనెటీగల పెంపకం వంటి రంగాలు కూడా గ్రామీణ అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి సరైన విధానాలు అవసరం. రైతులకు సాగు ఖర్చులను తగ్గించే విధంగా సహాయాలు అందించాలి. సాగునీటి సదుపాయాలు, నిల్వ గోదాములు, మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలి. రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి మరియు సరైన సమయంలో మార్కెట్‌కు తీసుకెళడానికి అవసరమెన సదుపాయాలు కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక యంత్రాలు, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, సమాచార సాంకేతికత వినియోగం ద్వారా రైతులు తమ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, పంటల సంరక్షణ పద్ధతులు వంటి విషయాలను రైతులకు సులభంగా అందించడం ద్వారా వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

గ్రామీణ వ్యవసాయం కేవలం ఆహారం ఉత్పత్తి చేసే రంగం మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలమైన ఆధారం. రైతులు బలపడితే దేశం బలపడుతుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం పురోగమిస్తుంది. అందువల్ల గ్రామీణ వ్యవసాయాన్ని బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన విషయం. రైతులకు అవసరమైన మద్దతు అందించడం, పంటల ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లడం వంటి చర్యలు తీసుకుంటేనే దేశ ఆహార భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుంది. గ్రామీణ వ్యవసాయం నిజంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన శక్తిగా నిలుస్తోంది.సాగునీటి సదుపాయాలు, నిల్వ గోదాములు, మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలి. రెతులు పండించిన పంటలకు సరెన దరలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి మరియు సరైన సమయంలో మార్కెట్‌కు తీసుకెళ్లడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక యంత్రాలు, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, సమాచార సాంకేతికత వినియోగం ద్వారా రైతులు తమ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, పంటల సంరక్షణ పద్ధతులు వంటి విషయాలను రైతులకు సులభంగా అందించడం ద్వారా వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. గ్రామీణ వ్యవసాయం కేవలం ఆహారం ఉత్పత్తి చేసే రంగం మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలమైన ఆధారం. రైతులు బలపడితే దేశం బలపడుతుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం పురోగమిస్తుంది. అందువల్ల గ్రామీణ వ్యవసాయాన్ని బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన విషయం. రైతులకు అవసరమైన మద్దతు అందించడం, పంటల ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లడం వంటి చర్యలు తీసుకుంటేనే దేశ ఆహార భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుంది. గ్రామీణ వ్యవసాయం నిజంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రదాన శకిగా నిలుసోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# 200 రోజులకు పైగా చెల్లుబాటుతో జియో ప్లాన్లు

హైదరాబాద్ – 6 మార్చి – తెలంగాణ ముచ్చట్లు




తరచుగా రీఛార్జ్ చేసుకోవడం ఇబ్బందిగా భావించే వినియోగదారుల కోసం ప్రముఖ టెలికాం సంస్థ జియో అనేక దీర్ఘకాలిక ప్రీపెయిడ్ ప్లాన్‌లను అందిస్తోంది. ముఖ్యంగా 200 రోజులకు పైగా చెల్లుబాటు కలిగిన ప్లాన్‌లకు ఇటీవల మంచి డిమాండ్ కనిపిస్తోంది. కాలింగ్ మాత్రమే అవసరమయ్యే వినియోగదారుల నుంచి ఎక్కువ డేటా ఉపయోగించే వారికి వరకు విభిన్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్లాన్‌లను రూపొందించారు. 200 రోజుల నుంచి దాదాపు ఏడాది వరకు చెల్లుబాటు కలిగిన ఈ ప్లాన్‌లు వినియోగదారులకు సౌకర్యంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

ఈ ప్లాన్‌లలో ఒకటి రూ.1748 ప్రీపెయిడ్ ప్లాన్. ఈ ప్లాన్ ప్రత్యేకత ఏమిటంటే ఇది మొత్తం 336 రోజుల చెల్లుబాటుతో అందుబాటులో ఉంటుంది. అంటే దాదాపు 11 నెలల పాటు మీ నంబర్ యాక్టివ్‌గా ఉంటుంది. ముఖ్యంగా ఇంటర్నెట్ అవసరం లేకుండా కేవలం కాలింగ్ కోసం మాత్రమే సిమ్ ఉపయోగించే వారికి ఇది అనుకూలంగా ఉంటుంది. ఈ ప్లాన్‌లో అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత వాయిస్ కాలింగ్‌తో పాటు మొత్తం 3600 సందేశాల సౌకర్యం కూడా ఉంటుంది. మొబైల్ డేటా అందించకపోయినా వినోద సేవల కోసం జియో టీవీ వంటి సేవలు, అలాగే 50 జీబీ క్లౌడ్ నిల్వ సౌకర్యం కూడా ఇందులో లభిస్తుంది. రెండో నంబర్‌గా ఉపయోగించే సిమ్ లేదా వృద్ధులకు ఈ ప్లాన్ ఉపయోగకరంగా ఉంటుందని టెలికాం వర్గాలు చెబుతున్నాయి.

ఇక రూ.2025 ప్రీపెయిడ్ ప్లాన్ 200 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. ఇందులో మొత్తం 500 జీబీ డేటా లభిస్తుంది. వినియోగదారులు రోజుకు 2.5 జీబీ హైస్పీడ్ డేటాతో పాటు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 సందేశాల సౌకర్యాన్ని పొందవచ్చు. రోజువారీ డేటా పరిమితి పూర్తయిన తర్వాత ఇంటర్నెట్ వేగం తగ్గుతుంది. అయితే అర్హత కలిగిన వినియోగదారులకు అపరిమిత ఐదో తరం మొబైల్ డేటా సదుపాయం కూడా లభిస్తుంది. అదనంగా కొత్త కనెక్షన్‌లపై ఉచిత హోమ్ బ్రాడ్‌బ్యాండ్ ట్రయల్, కొన్ని డిజిటల్ వినోద సేవల సబ్‌స్క్రిప్షన్‌లు, అలాగే క్లౌడ్ నిల్వ వంటి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయి.

అదేవిధంగా ఎక్కువ కాలం పాటు రోజువారీ డేటా అవసరమయ్యే వినియోగదారుల కోసం రూ.3599 ప్రీపెయిడ్ ప్లాన్ కూడా ఉంది. ఈ ప్లాన్ మొత్తం 365 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. ఇందులో రోజుకు 2.5 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. ఏడాది కాలానికి మొత్తం సుమారు 912.5 జీబీ డేటా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 సందేశాల సౌకర్యం కూడా ఇందులో భాగంగా ఉంటుంది.

ఇంకా మరో దీర్ఘకాలిక ఎంపికగా రూ.3999 ప్రీపెయిడ్ ప్లాన్ కూడా అందుబాటులో ఉంది. ఇది కూడా 365 రోజుల చెల్లుబాటుతోనే వస్తుంది. రోజుకు 2.5 జీబీ డేటాతో పాటు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 సందేశాల సౌకర్యం ఉంటుంది. డేటా పరిమితి పూర్తైన తర్వాత ఇంటర్నెట్ వేగం తగ్గినప్పటికీ ప్రాథమిక సేవలు కొనసాగుతాయి. టెలికాం రంగంలో పెరుగుతున్న పోటీ నేపథ్యంలో వినియోగదారులకు ఎక్కువ కాలం చెల్లుబాటు కలిగిన ప్లాన్‌లను అందించడం ద్వారా సంస్థలు వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి.

దీర్ఘకాలిక రీఛార్జ్ ప్లాన్‌లు ముఖ్యంగా తరచుగా రీఛార్జ్ చేయడం మరిచిపోతున్న వినియోగదారులకు, అలాగే ఏడాది పాటు నిరంతర సేవలను కోరుకునే వారికి అనువుగా ఉంటాయని టెలికాం నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వినియోగదారుల సేవల్లో లోపాలు.. నివేదిక వెల్లడి

హైదరాబాద్ – 6 మార్చి – (తెలంగాణ ముచ్చట్లు) ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల సేవల రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను విశ్లేషిస్తూ తాజాగా విడుదలైన 2026 వినియోగదారుల అనుభవ నివేదిక పలు కీలక అంశాలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ అధ్యయనం ప్రకారం భారతదేశంలోని కార్పొరేట్ సేవా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పెరుగుతున్నప్పటికీ, సంస్థల మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల వినియోగదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సేవల లోపాలను సరిచేసుకోవడానికి వినియోగదారులు ఏడాదికి సగటున దాదాపు పదిన్నర గంటల విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని నివేదిక వెల్లడించింది. సేవల అందుబాటులో ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉన్నప్పటికీ, వాటి మధ్య సరైన అనుసంధానం లేకపోవడం వల్ల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని పరిశోధన తెలిపింది.

సంస్థల్లో కృత్రిమ మేధస్సు వినియోగం పెరుగుతున్నప్పటికీ, డేటా వ్యవస్థలు మరియు సేవా నిర్వహణ పద్ధతులు పరస్పరం సమన్వయంతో పనిచేయకపోవడం పెద్ద సమస్యగా మారిందని నివేదిక పేర్కొంది. ఒక వినియోగదారుని సమస్యను పరిష్కరించేందుకు సేవా ప్రతినిధులు సగటున నాలుగు వేర్వేరు వ్యవస్థలను ఉపయోగించాల్సి వస్తోందని, దీనివల్ల గందరగోళం ఏర్పడి సమస్య పరిష్కార ప్రక్రియ మరింత ఆలస్యం అవుతోందని వెల్లడించింది. ఈ పరిస్థితుల కారణంగా దాదాపు నలభై నాలుగు శాతం మంది వినియోగదారులు ప్రస్తుత సంస్థలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అవసరమైతే ఇతర సంస్థల సేవలను ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నారని అధ్యయనం తెలిపింది. ఇది సంస్థల విశ్వసనీయతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక వినియోగదారుల అభిప్రాయాల ప్రకారం వేగవంతమైన సేవలతో పాటు మానవీయ స్పందన కూడా అత్యంత ముఖ్యమని నివేదిక స్పష్టం చేసింది. తమ సమస్యలను సంస్థలు సానుభూతితో అర్థం చేసుకోవడం లేదని దాదాపు నలభై ఎనిమిది శాతం మంది వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం యంత్రాల ఆధారిత ప్రతిస్పందనలు లేదా స్వయంచాలక సందేశాలతో సమస్యలు పరిష్కారం కావని, మానవీయ కోణంలో స్పందించే సేవలు అవసరమని వారు భావిస్తున్నారు.

నిపుణుల అభిప్రాయం ప్రకారం కృత్రిమ మేధస్సు మనుషులకు ప్రత్యామ్నాయం కాదని, అది సేవలను మెరుగుపరచే సహాయక సాధనం మాత్రమేనని ఈ నివేదిక సూచిస్తోంది. భవిష్యత్తులో వినియోగదారుల నమ్మకాన్ని పొందాలంటే సంస్థలు కేవలం లాభాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా, సాంకేతికతతో పాటు మానవీయ విలువలను కూడా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సమగ్ర డిజిటల్ వేదికలు, సమన్వయంతో పనిచేసే సేవా వ్యవస్థలు మరియు వినియోగదారుల భావోద్వేగాలను అర్థం చేసుకునే విధానాలను అమలు చేసే సంస్థలే భవిష్యత్తులో ముందంజలో నిలుస్తాయని నివేదిక స్పష్టం చేసింది.



# సౌరశక్తి రంగంలో భారత్ వేగవంతమైన అడుగులు

- విద్యుత్ కొరత నుంచి శక్తి స్వావలంబన దిశగా ప్రయాణం
- దేశంలో భారీ సౌర పార్కుల ఏర్పాటు
- సౌర పథకాలతో ప్రజలకు లాభాలు

**న్యూఢిల్లీ, మార్చి 7 (తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న భారత్ ఇప్పుడు సౌరశక్తి రంగంలో వేగంగా ముందుకు సాగుతోంది. శక్తి స్వావలంబన లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పలు సౌరశక్తి పథకాలను అమలు చేస్తూ విద్యుత్ ఉత్పత్తిని పెంచుతోంది. దేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద సౌర పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు సౌరశక్తి ఉత్పత్తిని విస్తృతంగా పెంచుతున్నారు. సౌర విద్యుత్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడడంతో పాటు పర్యావరణహిత శక్తి వినియోగం పెరుగుతోంది. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన వంటి పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందేలా చర్యలు చేపట్టారు. అలాగే రైతులకు సౌర పంపులను అందించడం ద్వారా వ్యవసాయ రంగంలో కూడా సౌరశక్తి వినియోగాన్ని పెంచుతున్నారు. సౌరశక్తి వినియోగం పెరగడంతో విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా దేశం శక్తి స్వావలంబన దిశగా ముందుకు సాగుతోంది. ఇది కేవలం విద్యుత్ రంగానికే కాకుండా ఆర్థిక అభివృద్ధికి కూడా కీలకంగా మారుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.



# వీర జవాన్లకు అమిత్ షా నివాళులు

- ముండాలి శిక్షణ కేంద్రంలో కార్యక్రమం
- సీఐఎస్ఎఫ్ అమరుల స్మారకానికి పుష్పాంజలి
- సేవలో ప్రాణత్యాగం చేసిన జవాన్లకు గౌరవం

కేంద్ర గృహ మరియు సహకార శాఖ మంత్రి అమిత్ షా ఒడిశా రాష్ట్రంలోని ముండాలి శిక్షణ కేంద్రంలో సీఐఎస్ఎఫ్ అమర జవాన్లకు నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సీఐఎస్ఎఫ్ సిబ్బందిని స్మరించుకుంటూ అమర వీరుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి గౌరవ నివాళులు తెలిపారు. ముండాలిలోని సీఐఎస్ఎఫ్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరుల త్యాగాన్ని స్మరించుకున్నారు. దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన జవాన్ల సేవలను కేంద్ర మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా పూర్తి గౌరవాలతో కార్యక్రమం నిర్వహించబడింది.

సేవలో ప్రాణత్యాగం చేసిన సిబ్బంది త్యాగం దేశానికి స్ఫూర్తిదాయకమని అధికారులు పేర్కొన్నారు. భద్రతా దళాల ధైర్యసాహసాలు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సీఐఎస్ఎఫ్ తమ అమర వీరుల పట్ల గల గౌరవం, కృతజ్ఞతను మరోసారి చాటుకున్నట్లు అధికారులు తెలిపారు.

# సుశాంత్‌తో ప్రేమపై మీనాక్షి చౌదరి స్పందన

హైదరాబాద్ – 6 మార్చి – (తెంగాణ ముచ్చట్లు) ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో వివాహాల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల విజయ్ – రష్మిక వివాహం గురించి వార్తలు వినిపించగా, మార్చి 6న అల్లుశిరీష్ – నయనిక రెడ్డి వివాహం జరగనున్న నేపథ్యంలో సినీ వర్గాల్లో పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇదే సమయంలో నటి మీనాక్షి చౌదరి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని గాసిప్స్ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందాయి. ముఖ్యంగా ఆమె ఒక తెలుగు హీరోతో ప్రేమలో ఉన్నారని వార్తలు రావడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి ఆ వార్తలపై స్పష్టత ఇచ్చారు.

తన అందం, సహజమైన నటనతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు పొందిన నటీమణుల్లో మీనాక్షి చౌదరి ఒకరు. చాలా మంది నటీనటులు చిన్నప్పటి నుంచే సినిమా రంగంలోకి రావాలనే కలతో ఉంటామని చెబుతుంటారు. అయితే మీనాక్షి చౌదరి మాత్రం మొదట చదువుకు ప్రాధాన్యత ఇచ్చి దంతవైద్య విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి అక్కడి నుంచి వచ్చిన అవకాశాలతో సినిమా ప్రపంచంలోకి ప్రవేశించారు. మోడలింగ్ ద్వారా వచ్చిన గుర్తింపే ఆమెకు నటిగా మారేందుకు మార్గం చూపిందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

మొదట ఉత్తర భారత చిత్రంతో తెరపై కనిపించిన ఆమె, తర్వాత తెలుగులో వచ్చిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు చిత్రంతో ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ తర్వాత వరుసగా పలు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా ఖిలాడీ, హిట్ రెండవ భాగం, గుంటూరు కారం వంటి చిత్రాల్లో చేసిన పాత్రలు ఆమెకు మంచి గుర్తింపును తీసుకొచ్చాయి. అలాగే వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన లక్కీ భాస్కర్ చిత్రంలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. వెంకటేష్‌తో కలిసి నటించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం కూడా మంచి విజయాన్ని అందుకోవడంతో ఆమెకు మరింత ఆదరణ పెరిగింది.

తెలుగు మాత్రమే కాకుండా తమిళ చిత్రాల్లో కూడా మీనాక్షి చౌదరి నటిస్తూ తన పరిధిని విస్తరించుకుంటున్నారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగచైతన్య ప్రధాన పాత్రలో రూపొందుతున్న వృషకర్మ చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఆమె లుక్ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది. చిత్రీకరణ వేగంగా సాగుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే మంచి ఆసక్తిని కలిగిస్తోంది.

ఇదిలా ఉండగా కొంతకాలంగా మీనాక్షి చౌదరి ఒక తెలుగు హీరోతో ప్రేమలో ఉన్నారని వార్తలు వినిపించాయి. ముఖ్యంగా నటుడు సుశాంత్‌తో ఆమెకు సన్నిహిత సంబంధం ఉందని, ఇద్దరూ కలిసి నటించిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు చిత్రీకరణ సమయంలో స్నేహం పెరిగి అది ప్రేమగా మారిందని ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై స్పందించిన మీనాక్షి చౌదరి ఆ గాసిప్‌స్‌ను పూర్తిగా ఖండించారు. సుశాంత్‌తో తనకు ఎలాంటి ప్రేమ సంబంధం లేదని, అతను తనకు మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు.

ఈ విషయంపై గాసిప్స్ ఎక్కువగా రావడంతో మీనాక్షి చౌదరి బృందం కూడా స్పందించింది. ఇద్దరూ కేవలం స్నేహితులే తప్ప ప్రేమలో లేరని వారు తెలిపారు. అనవసరమైన ఊహాగానాలను నమ్మకూడదని, వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వవద్దని కూడా సూచించారు. ప్రస్తుతం తన దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉందని, మంచి కథలతో ప్రేక్షకులను అలరించడం తన లక్ష్యమని మీనాక్షి చౌదరి వెల్లడించారు.





# గ్లోబల్ వేదికపై మరోసారి దేశీ గర్ల్.. ఆస్కార్ ప్రజెంటర్‌గా ప్రియాంక చోప్రా

ప్రపంచ సినీ వేదికపై భారతీయుల ప్రతిభను మరోసారి ప్రతిష్ఠాత్మకంగా చాటేందుకు ప్రముఖ నటి ప్రియాంక చోప్రా జోనాస్ సిద్ధమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు పొందిన ఈ నటి, ఈసారి జరిగే 98వ అకాడమీ అవార్డ్స్ వేడుకలో అవార్డు ప్రజెంటర్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ఈ వేడుకలో ఆమె పాల్గొనడం భారతీయులకు గర్వకారణంగా నిలుస్తోంది.

అమెరికాలోని డాల్బీ థియేటర్ లో మార్చి 15న జరగనున్న ఈ మహా వేడుకలో హాలీవుడ్ ప్రముఖ నటులతో కలిసి ప్రియాంక చోప్రా వేదికను పంచుకోనుంది. ముఖ్యంగా రాబర్ట్ డౌనీ జూనియర్, క్రిస్ ఎవాన్స్ వంటి అగ్ర నటులతో కలిసి ఆమె అవార్డులను ప్రకటించనుండటం విశేషంగా మారింది. ఈ విషయాన్ని అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అధికారికంగా ప్రకటించగా, ప్రియాంక కూడా తన సోషల్ మాధ్యమాల ద్వారా ఈ ఆనందకరమైన విషయాన్ని అభిమానులతో పంచుకుంది.

ఇది ప్రియాంకకు కొత్త అనుభవం కాదు. గతంలో 2016లో కూడా ఆమె ఆస్కార్ వేదికపై అవార్డు ప్రజెంటర్‌గా వ్యవహరించి ప్రపంచ సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దాదాపు దశాబ్దం తర్వాత మరోసారి అదే గౌరవం దక్కడం ఆమె అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ప్రభావాన్ని చూపిస్తోంది.

ఈ ఏడాది ఆస్కార్ వేడుకలకు మరొక ప్రత్యేకత కూడా ఉంది. ప్రముఖ టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓ'బ్రియన్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నాడు. అలాగే ప్రజెంటర్ల జాబితాలో అన్నే హాత్వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి హాలీవుడ్ ప్రముఖులు కూడా ఉన్నారు.

సినిమాల విషయానికి వస్తే, ఈసారి సిన్నర్స్ చిత్రం ఏకంగా పదహారు నామినేషన్లతో ముందంజలో ఉందని తెలుస్తోంది. ఇక ఉత్తమ నటుడి విభాగంలో లియోనార్డో డికాప్రియో, తిమోతీ చాలమెట్ వంటి అగ్ర నటుల మధ్య గట్టి పోటీ నెలకొంది.

ఇలా ప్రపంచ సినీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ వేడుకలో భారతీయ నటి ప్రియాంక చోప్రా మరోసారి భాగస్వామి కావడం దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. ప్రపంచ వేదికపై భారతీయుల ప్రతిభను చాటుతూ ఆమె కొనసాగిస్తున్న ప్రయాణం అభిమానులను మరింత ఉత్సాహపరుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in